

విద్యుద్దీపాల అలంకరణలో మైలాపూర్ కపాలేశ్వరాలయం



అరుణాచలేశ్వరాలయం

● నేడు మహాశివరాత్రి

శివపూజకు ముస్తాబైన శివాలయాలు

ప్యారీస్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వున్న శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జరిగే జాగరణ, పూజలకు రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాలు ప్రత్యేక హంగులు సంతరించుకున్నాయి. రాష్ట్రంలో అగ్ని క్షేత్రంగా పేరొందిన తిరువణ్ణామలై ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఉపవాసాలతో దీక్ష చేపట్టి ఆలయంలో జాగరణ చేసే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే గిరిప్రదక్షణ మార్గంలోని సన్నిధులు, ఉన్నామలై అమ్మవారి సమేత అన్నామలైయార్ ప్రధానాలయం, అరుణాచలం కొండపై వెలసిన ఆలయాలను అలంకరించారు. అలాగే తంజావూర్‌లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బృహదీశ్వరాలయంలో రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకం చేయనున్నారు. ఈ ఆలయంలో మహా నంది విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. కడలూరు జిల్లాలోని చిదంబరం నటరాజస్వామి ఆలయంలో జరిగే పూజల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా వివిధ ప్రాంతాల భక్తులు మంగళవారం నాటికే పెద్ద సంఖ్యలో ఇక్కడికి చేరుకున్నారు. స్థానిక షావుకారుపేటలోని ఏకాంబరేశ్వరాలయం, రామేశ్వరంలోని రామనాధీశ్వరాలయం, కాంచీపురం కైలాసనాథ ఆలయం, తిరువొత్తియూర్ వడివుడి అమ్మవారి సమేత త్యాగరాజస్వామి ఆలయం, కుంభకోణంలోని ఐరావతేశ్వరాలయం, తిరుముల్లైవాయిల్ మాశిలా మణీశ్వర ఆలయాల్లో శివారాత్రి పూజలు నిర్వహించనున్నారు. కాగా, శివరాత్రి పూజల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు ప్రధానమైన శైవక్షేత్రాలకు అన్ని జిల్లాల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రకటించాయి.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

ప్యారీస్ ప్రాంతంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం సాయంత్రం 4గంటల నుండి గురువారం తెల్లవారుజామున 2.45గంటల వరకు నాలుగు జాముల పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. షావుకారుపేట వరదా ముత్తయ్యప్పన్‌వీధిలోవున్న నారాయణ గురవయ్యశెట్టి సత్రంలో వైశ్య గురుసేవా సమితి తమిళనాడు విభాగం, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో గంగా హారతి, రుద్రాభిషేకం, మహా కుంభమేళ తీర్థవినియోగం, స్వర్ణలింగానికి బిల్వార్చన చేయనున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో..

కొరట్టూరు వాటర్ కెనాల్ రోడ్డులోవున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం 6.30గంటల నుండి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి అభిషేకం, సహస్ర నామార్చన, రుద్రాభిషేకం, శాంతి కళ్యాణం, నాలుగు జాముల పూజలు నిర్వహించనున్నారు.

అక్షయబాబా ఆలయంలో..

బ్రాడ్‌వే ఆచారప్పన్‌వీధిలోని అక్షయబాబా ఆలయంలో సాయంత్రం 7 గంటల నుంచి రుద్రాభిషేకం సహా పూజలు నిర్వహించనున్నారు.

ఎవరికోసం రజనీ వ్యూహం?

● బీజేపీ కూటమి బలోపేతానికి తలైవా యత్నం

● అందుకే జయ నివాసానికి వెళ్లారా?

● ఈపీఎస్ వ్యతిరేకులందరినీ ఏకతాటిపైకి తేనున్నారా?

● రాజకీయవర్గాల్లో సర్వత్రా చర్చ

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తన సన్నిహితల కోరిక మేరకు రాష్ట్రంలో బీజేపీ కూటమి బలోపేతానికి రజనీ పూనుకున్నారా?.. అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యతిరేకులందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు నడుం బిగించారా?.. ఇందులో భాగంగానే రజనీ దివంగత ముఖ్యమంత్రి జయలలిత నివాసానికి వెళ్లారా?.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రజనీ క్రియాశీలకంగా వ్యవహరించనున్నారా?.. అవుననే అంటున్నాయి ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు.

జయ జయంతి సందర్భంగా సోమవారం పోయెస్‌గార్డెన్‌లో వున్న 'వేదనివాస్'కు వెళ్లిన రజనీకాంత్ మాజీముఖ్యమంత్రి జయలలిత చిత్రపటానికి నివాళులర్పించారు. అంతేగాక జయ మేనకోడలు దీప, మేనల్లుడు దీపక్ కుటుంబాలతోనూ సన్నిహితంగా మెలిగారు. ఆ కొద్దిసేపటికే అన్నాడీఎంకే బహిష్కృత నేత ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) కుమారుడు, తేని మాజీ ఎంపీ రవీంద్రనాథ్ కుమార్ కూడా జయ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకేలో విప్లవం మొదలైందని, త్వరలో ఆయా నేతలు, కార్యకర్తలంతా తిరుగుబాటు చేస్తారని వ్యాఖ్యానించారు. రజనీ వేదనివాస్ నుంచి వెళ్లిన కొద్దిసేపటికే ఇదంతా జరగడం గమనార్హం. నిజానికి రజనీ జయకు నివాళులర్పించాలని భావిస్తే, ఆమె స్మారకమందిరానికి వెళ్లొచ్చు. అలా కాకుండా 29 ఏళ్ల తరువాత ఆయన జయ నివాసానికి రావడం, ఆ తరువాత కొద్దిసేపటికే ఓపీఎస్ కుమారుడు రావడం యాదృచ్ఛికం కాదని రాజకీయవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఒకే గొడుగు కిందకు బహిష్కృత నేతలు...

తమను ఎలాగోలా పార్టీలో చేర్చుకోవాలంటూ బహిష్కృత నేతలైన మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్, అన్నాడీఎంకే మాజీ ప్రధాన కార్యదర్శి వీకే శశికళ, ఇదే పార్టీలో ఒకప్పుడు చక్రం తిప్పిన ప్రస్తుత 'అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం' నేత టీటీవీ దినకరన్ రకరకాలుగా ఈపీఎస్‌కు రాయబారాలు పంపుతున్నారు. అయితే ఇందుకు ఆయన ససేమిరా అనడంతో, ఎలాగైనా ఈపీఎస్‌ను దెబ్బ కొట్టాలని వ్యూహరచన చేస్తున్నారు. అంతేగాక తన మేనత్త వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలని భావించి, అప్పట్లో ఆస్తులతో సంతృప్తి పడి, ఇప్పుడు మళ్లీ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేందుకు ఉవ్విళ్లూరుతున్న జయ మేనకోడలు దీప కూడా ఈపీఎస్ వ్యవహారశైలిపై రగిలిపోతున్నారు. జయ ఆస్తులన్నీ తీసుకుని మిన్నకుండిపోవాలని, పార్టీ జోలికి రావద్దంటూ దీప, దీపక్‌లకు అప్పట్లో ముఖ్యమంత్రిగా వున్న ఈపీఎస్ నచ్చజెప్పారు. కోర్టు ఆధీనంలో వున్నవి మినహా, మిగిలిన ఆస్తులన్నీ తమకు వస్తున్నాయన్న సంతోషంలో ఈపీఎస్ మాటలకు కట్టుబడిన దీప.. ఇప్పుడు రాజకీయ అరంగేట్రం కోసం తహతహలాడుతున్నారు. అయితే తగిన వేదిక కోసం ఆమె వేచిచూస్తున్నారు. ఇప్పుడు ఆమె కూడా ఓపీఎస్, శశికళ వర్గంతో చేతులు కలిపే సూచనలు కనిపిస్తున్నాయి.

క్రియాశీలకంగా సూపర్‌స్టార్...

తమిళనాట డీఎంకేను అడ్డుకోవాలంటే అన్నాడీఎంకేతో చేతులు కలపడం మినహా మరో మార్గం లేదని భావిస్తున్న బీజేపీ.. తమకు అత్యంత మిత్రుడైన రజనీకాంత్‌ను రంగంలోకి దింపినట్లు తెలిసింది. ఈపీఎస్‌కు సర్దిచెప్పి, తమతో చేతులు కలిపేలా చేయడం, లేదా అన్నాడీఎంకే అసమ్మతి వర్గాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడంతో పాటు ఇతర పార్టీలను తమ కూటమిలో చేరేందుకు సహకరించాలని బీజేపీ ఢిల్లీ పెద్దలు రజనీని కోరినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే రజనీకాంత్ గతానికి భిన్నంగా జయ నివాసానికి వెళ్లి మరీ అంజలి ఘటించడమని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే రజనీ నివాసానికి వెళ్లి ఓపీఎస్ భేటీ అయ్యారు. ఇప్పుడుజయ నివాసంలో వుంటున్న ఆమె మేనకోడలు, మేనల్లుడితో రజనీకాంత్ భేటీ అయ్యారు. ఈ సమయంలో జయ నమ్మినబంటు, ఓపీఎస్ వర్గీయుడైన పుహళేంది కూడా వుండడం గమనార్హం. ఈ సందర్భంగా తన నివాసానికి విందుకు రావాలని దీపక్, దీపను రజనీ ఆహ్వానించగా, అందుకు వారు అంగీకరించినట్లు సమాచారం. ఇక రజనీ కుటుంబానికి శశికళ సన్నిహితురాలే. వీరందరినీ ఒకేతాటిపైకి తీసుకురావడంలో భాగంగానే రజనీకాంత్ వారితో సమావేశమవుతున్నారని తెలుస్తోంది. అంతేగాక 'నామ్ తమిళర్ కట్చి' అధినేత సీమాన్ కూడా గతంలో రజనీతో భేటీ అయ్యారు. ఆ తరువాత ఆయన స్వరం మారింది. బీజేపీ పట్ల సానుకూలత వ్యవహరిస్తున్నారు. అది రజనీ ప్రభావమేనని రాజకీయవర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఒకవేళ ఈపీఎస్ బీజేపీతో కూటమికి అంగీకరించనిపక్షంలో వీరంతా ఒకేతాటిపైకొచ్చి బీజేపీతో చేతులు కలుపుతారని ఆ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. రజనీకాంత్‌కు డీఎంకే నేతలతో స్నేహ సంబంధాలున్నప్పటికీ.. బీజేపీ నేతలతో అంతకుమించిన సాన్నిహిత్యముందని, అందుకే ఆయన వారికి పరోక్ష సాయం అందిస్తున్నారని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

మరోపక్క బీజేపీ

అసెంబ్లీ ఎన్నికల్లో తమతో చేతులు కలపాల్సిందేనంటూ ఈపీఎస్‌పై రకరకాలుగా బీజేపీ ఒత్తిడి చేస్తోంది. నయానోభయాన్నో ఆయన్ని తమ దారిలోకి తెచ్చుకునేందుకు చేయాల్సిందంతా చేసేస్తోంది. అదే సమయంలో బహిష్కృత నేలందరినీ అన్నాడీఎంకేలోకి చేర్చుకుని, డీఎంకేపై పోరాడాలని ఈపీఎస్‌కు సూచిస్తోంది. బీజేపీతో చేతులు కలిపేందుకు సానుకూలంగా వున్న ఈపీఎస్.. బహిష్కృత నేతల్ని చేర్చుకునేందుకు మాత్రం ససేమిరా అంటున్నారు. తమ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో బీజేపీ జోక్యాన్ని ఆయన పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.



జయ నివాసంలో ఆమె మేనకోడలు దీప, పుహళేందితో మాట్లాడుతున్న రజనీ



సచివాలయంలో మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

5న అఖిలపక్షం

40 పార్టీల ప్రతినిధులకు ఆహ్వానం ● నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ ● మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం ● బడ్జెట్ కసరత్తుపైనా చర్చ

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజన కారణంగా రాష్ట్రంలో కోల్పోనున్న 8 పార్లమెంటు స్థానాలపై చర్చించేందుకు వచ్చే నెల 5వ తేదీన అఖిలపక్షం భేటీ కావాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. వార్షిక బడ్జెట్ రూపకల్పన, కొత్త పథకాల ప్రకటన కొత్త పరిశ్రమల ఏర్పాటు తదితరాలపై చర్చించిన మంత్రివర్గం.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ మంత్రి దురైమురుగన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, కేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్ బాబు, పొన్ముడి, గీతా జీవన్, అనితా రాధాకృష్ణన్, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, తంగం తెన్నరసు, పళనివేల్ త్యాగరాజన్, శివశంకర్, ముత్తుసామి, కోవి చెళియన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం సచివాలయం వెలుపల ముఖ్యమంత్రి స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుటుంబ నియంత్రణ సమర్థవంతంగా అమలు చేస్తున్న దక్షిణాది రాష్ట్రాలపై ఎంపీ నియోజకవర్గాల పునర్విభజన అనే కత్తి వేలాడదీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్రంలో లోక్‌సభ స్థానాల సంఖ్య 39 నుండి 31 కి చేరుతుందని, ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో మార్చి ఐదున అఖిలపక్ష సమావేశం జరిపేందుకు కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు కలిగిన 40 పార్టీల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కేంద్రప్రభుత్వం అధిక జనాభా కలిగిన ఉత్తరాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య చెడామడా పెంచి, దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న సీట్లను బాగా తగ్గిస్తోందని, అదే జరిగితే రాష్ట్ర సమస్యలను పార్లమెంట్ దృష్టికి సమర్థవంతంగా తీసుకెళ్లలేమన్నారు. అఖిల పక్ష సమావేశంలో త్రిభాషా విద్యావిధానం అమలుకు కేంద్రం చేస్తున్న ఒత్తిడి, నీట్ రద్దు, రాష్ట్రానికి కేంద్రం నిలిపివేసిన నిధుల గురించి కూడా చర్చిస్తామన్నారు. జాతీయ విద్యావిధానాన్ని అన్నాడీఎంకే సహా అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. అన్నాడీఎంకే కూడా నిర్బంధ హిందీకి వ్యతిరేకంగా ప్రభుత్వానికి మద్దతిస్తుందనే ఆశిస్తున్నామన్నారు. హిందీ వ్యతిరేకోద్యమాన్ని ఏ సమయంలోనైనా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.


● అక్రమార్జన కేసు వ్యవహారం...

ఎమ్మెల్యే అమ్మన్ కె.అర్జునన్‌పై ఏసీబీ పంజా

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి రూ.2.75 కోట్ల అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై విచారణలో భాగంగా కోవైలో అన్నాడీఎంకే ఎమ్మెల్యే అమ్మన్ కె.అర్జునన్ నివాసంలో రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. అన్నాడీఎంకే కోయంబత్తూరు కార్పొరేషన్ విభాగ కార్యదర్శిగా ఉన్న అమ్మన్ కె.అర్జునన్ 2021 శాసనసభ ఎన్నికల్లో కోయంబత్తూరు నార్త్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచారు. అంతకు ముందు 2016-21 వరకు కోయంబత్తూరు సౌత్ నియోజకవర్గం శాసనసభ్యుడిగా ఉండేవారు. కోయంబత్తూరు కండకాముత్తూరు రోడ్డు మూడోవీధిలో అర్జునన్ నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఏసీబీ అడిషనల్ ఎస్పీ దివ్య నాయకత్వంలో కోవై జిల్లా ఏసీబీ పోలీసులు అర్జునన్ నివాసంలో ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. ఆ సమయంలో అర్జునన్ అక్కడే ఉన్నారు. ఆదాయానికి మించి అక్రమంగా ఆస్తులు సంపాదించారనే ఆరోపణలపై విచారణలో భాగంగా తనిఖీలు జరిపేందుకు వచ్చామని ఏసీబీ అధికారులు ఆయనకు తెలిపారు. ఆ తర్వాత నివాసంలో ఉన్నవారంతా ఏసీబీ అధికారుల తనిఖీకి సహకరించారు. ఈ తనిఖీలు గురించి తెలియగానే అన్నాడీఎంకే స్థానిక నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. 2016 మే నుంచి 2022 మార్చి వరకు తన ఆదాయానికి మించి రూ.2.75 కోట్ల మేరకు అక్రమంగా సంపాదించినట్లు ఇటీవల కోయంబత్తూరు జిల్లా ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇదిలా వుండగా అర్జునన్ మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ కక్షలో భాగంగానే తన ఇంటిపై ఏసీబీ దాడులు జరిగాయని ఆరోపించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కూడా అర్జునన్ ఇంట్లో ఏసీబీ దాడులను తీవ్రంగా ఖండించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను ఇబ్బంది పెట్టాలన్న కుట్రతోనే ప్రభుత్వం ఇలాంటి సోదాలకు పురిగొల్పిందని ఆరోపించారు.



ఎమ్మెల్యే అమ్మన్ కె.అర్జునన్ నివాసం





ఏసీబీ తనిఖీలను ఇంటి కిటికీలో నుంచి చిత్రీకరిస్తున్న వీడియో జర్నలిస్టులు

సమాచార దర్శిని

ఈరోడ్-ఒడిశా రైళ్ల పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ నుంచి చెన్నై ఎగ్మూర్ మీదుగా ఒడిశా వెళ్లే వారాంతపు రైళ్ల సేవలు ఏప్రిల్ వరకు పొడిగించారు. ఆ ప్రకారం, సంబల్‌పూర్-ఈరోడ్ మధ్య బుధవారం రాత్రి 8.30 గంటలకు నడిపే వారాంతపు ప్రత్యేక రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30వ తేది వరకు పొడిగించారు. మరుమార్గంలో ఈరోడ్-సంబల్‌పూర్ మధ్య శుక్రవారం రాత్రి 11.15 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మార్చి 12 నుంచి మే 2వ తేది వరకు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

తిరుత్తణి హుండీ ఆదాయం రూ.1.69 కోట్లు

తిరుత్తణి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మురుగన్ హుండీ ఆదాయం రూ.1.69 కోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మురుగన్ దర్శనం కోసం ప్రతిరోజు వేలాది మంది భక్తుల వస్తుంటారు. కోర్కెలు తీరిన భక్తులు కొండ ఆలయ ప్రాంగణంలోని హుండీల్లో నగదు, బంగారం, వెండి సహా పలు వస్తువులు స్వామివారికి సమర్పిస్తుంటారు.ఆ ప్రకారం, 28 రోజులు భక్తులు హుండీల్లో వేసిన కానుకల లెక్కింపు సోమవారం ఆలయ సిబ్బంది చేపట్టారు.రూ.1,59,71,698 నగదు, 921గ్రాముల బంగారం, 11,012 గ్రాముల వెండి భక్తులు కానుకగా సమర్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రైళ్లలో మహిళల భద్రతకు 'వాట్సాప్ గ్రూప్'

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళ సురక్షితంగా ప్రయాణించేలా 'వాట్సాప్' గ్రూప్ ఏర్పాటుచేయాలని రాష్ట్ర రైల్వే పోలీసులు నిర్ణయించారు. రైళ్లలో ప్రయాణిస్తున్న మహిళలపై లైంగిక వేధింపులు, సెల్‌ఫోన్, చైన్ స్నాచింగ్ ఘటనలు అధికమవుతున్నాయి. రాత్రి సమయాల్లో స్టేషన్‌లో ఒంటరిగా ఉంటున్న మహిళలు, రైళ్లలో ఒంటరిగా ప్రయాణించే మహిళలపై వేధింపులు జరుగుతున్నాయి. ఈ చర్యలు అడ్డుకొనేలా రైల్వేస్టేషన్లు, రైళ్లలో పోలీసు భద్రత పెంచారు. ఈ నేపథ్యంలో, సబర్బన్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తరచూ ప్రయాణించే మహిళలను గుర్తించి, వారితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేయాలని రైల్వే పోలీసులు నిర్ణయించారు. రైల్వేస్టేషన్లు, రైళ్లలో సంచరించే అనుమానాస్పద వ్యక్తుల వివరాలు, దోపిడీలు, వేధింపుల ఘటనపై సభ్యులు వాట్సాప్‌లో పోస్ట్ చేసిన వెంటనే సత్వరం చర్యలు చేపట్టేందుకు ఈ గ్రూప్‌లు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

యూ ట్యూబ్ ఛానల్ నిర్వహణపై శిక్షణ

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూ ట్యూబ్ ఛానల్ నిర్వహణపై మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు.యూట్యూబ్‌ఛానల్ ప్రారంభం, వీడియో, స్లైడ్ షో అప్‌లోడ్ చేయడం, వినియోగదారుల స్పందన సహా పలు అంశాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. మార్చి 5 నుంచి 7వ తేది వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. 18 ఏళ్ల పైబడి టెన్త్ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు పాల్గొనవచ్చు. మూడు రోజులు ఉండేందుకు తక్కువ చార్జీతో వసతి కల్పించనున్నారు. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయాన్ని 86681 08141, 866810 2600, 7010143022 అనే నెంబర్లను సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు (కార్యాలయం పనివేళలు) సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

రంజాన్ ఉపవాస గంజ తయారీకి 7,920 టన్నుల బియ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షలో గంజి తయారీకి 7,920 టన్నుల పచ్చి బియ్యం అందించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. ఈ మేరకు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... ప్రతి ఏడాది పవిత్ర రంజాన్ సందర్భంగా ఉపవాసం ఉండే ముస్లిం కోసం గంజాయి తయారీకి రాష్ట్ర ప్రభుత్వం మసీదులకు పచ్చిబియ్యం అందజేస్తుంటుంది. ఆ ప్రకారం, ఈ ఏడాది రంజాన్ పండుగ సందర్భంగా మసీదులకు 7,920 టన్నుల పచ్చి బియ్యం అందించాలని, ఒక్కో మసీదుకు అవసరమైన బియ్యం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ఈ బియ్యం అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.18.40 కోట్లు అదనపు భారమని సచివాలయం తెలియజేసింది.

తిరునల్వేలిలో పులుల గణన

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కలక్కాడు ముండతురై పులుల శరణాలయంలో పులుల గణన ప్రారంభమైంది. తిరునల్వేలి జిల్లా పశ్చిమ కనుమల్లో ఉన్న కలకాడు ముండతురై పులుల శరణాలయంలో ప్రతి ఏడాది పులుల గణన చేపడుతుంటారు. ఈ ప్రకారం, ఈ ఏడాది గణన సోమవారం ప్రారంభమై మార్చి 1వ తేది వరకు ఆరు రోజులు జరుగనుంది. ఈ గణనలో పాపనాశం, ముండతురై, కడయం, అంబై తదితర రేంజ్ పరిధికి చెందిన 200 మంది అటవీ సిబ్బంది, వేట నిరోధక విభాగం పోలీసులు పాల్గొననున్నారు. సెల్‌ఫోన్ యాప్ ద్వారా పులుల కాలి ముద్రలు, వ్యర్థాలు, అడవుల్లో ఉంచిన కెమెరాల్లో నమోదైన ఫుటేజీ ఆధారంగా పులుల గణన చేపట్టనున్నారు. ఈ కారణంగా, కారైయార్ సోరిముత్తు అయ్యనార్ ఆలయం, మణిముత్తారు జలపాతం, అగస్తియర్ జలపాతం తదితర ప్రాంతాలకు మార్చి 2వ తేది వరకు పర్యాటకులు, భక్తులు వెళ్లేందుకు నిషేధం విధించినట్లు, పాపనాశం, మణిముత్తారు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి పర్యాటకులు వెళ్లకుండా పర్యవేక్షిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

రోడ్డెక్కిన జాక్టో-జియో

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, పలుచోట్ల ఉద్రిక్తత
- పాత పింఛన్... ఖాళీ పోస్టుల భర్తీ డిమాండ్లే ప్రధానం

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులు-ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య (జాక్టో-జియో) ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. పాత పింఛన్ విధానం, ఖాళీ పోస్టుల భర్తీ సహా పలు డిమాండ్లను ప్రభుత్వ పరిష్కరించాలని ఆందోళనల్లో వారు నినదించారు. ఈ కోర్కెల సాధనకు జాక్టో-జియో పలు రూపాల్లో ఆందోళన చేపట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. దీంతో, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా మంత్రులు ఏవీ వేలు, తంగం తెన్నరసు, అన్బిల్ మహేష్, కయల్‌విళి సెల్వరాజ్‌లతో కూడిన కమిటీని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నియమించారు. ఈ కమిటీ సోమవారం సచివాలయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమైంది. ఈ సందర్భంగా సంఘాల నేతలు ఈ కమిటీకి తమ సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు అనంతరం సాయంత్రం కమిటీ ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మంత్రుల కమిటీ జాక్టో-జిక్టో నేతలను సంప్రదించి, సమస్యల పరిష్కారానికి సీఎం చర్యలు చేపడతారని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం సచివాలయంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జాక్టో-జియో నేతలు సమావేశమయ్యారు. ఈ విషయమై జాక్టో-జియో ఆర్గనైజర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి నాలుగు వారాలు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం కోరిందని, ఇందుకు తాము అంగీకరించలేదన్నారు. ఇదివరకే ప్రకటించినట్లు మంగళవారం ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నిస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు



తూత్తుకుడి కలెక్టర్ కార్యాలయం ఎదుట జాక్టో-జియో సభ్యుల ఆందోళన

స్తంభించిన సేవలు...

జాక్టో-జియో పిలుపు మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మంగళవారం విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. జిల్లా ప్రధాన కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టిన సభ్యులు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యాలయం వద్ద పోలీసులు, ఆందోళనకారులను అడ్డుకున్నారు. బాకికేడ్లు నెట్టుకుంటూ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఉద్యోగులు విధులు బహిష్కరించడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు స్తంభించాయి. అలాగే, ఉపాధ్యాయులు కూడా సమ్మెలో పాల్గొనడంతో పలు పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు మాత్రమే కనిపించారు.

హిందీ నిర్బంధం అంగీకరించం

రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే విద్యార్థి విభాగం నిరసన



ప్రదర్శనలో విద్యార్థులు

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా హిందీ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ డీఎంకే విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. యూజీసీ ముసాయిదా విధానం ఉపసంహరించుకోవాలి, త్రిభాష విధానాన్ని నిర్బంధం చేసే నూతన విద్యా విధానం వాపసు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీఎంకే విద్యార్థి విభాగం నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. సైదాపేటలోని పనగల్ మాలిగై సమీపంలో డీఎంకే విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. తిరువణ్ణామలై జిల్లా ఆరణి తపాలా కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అలాగే, తిరువణ్ణామలై కామరాజ్ రోడ్డు నుంచి సుమారు 500 మంది కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. తిరుచెంగోడు ప్రధాన తపాలా కార్యాలయం, తాంబరం సహా రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ ప్రదర్శనలో డీఎంకే యువజన విభాగం, ఎండీఎంకే, మనిద నేయ మక్కల్ కట్చికి చెందిన విద్యార్థి సంఘాలు కూడా పాల్గొన్నాయి.

9న 'సర్ త్యాగరాయ కళా పరిషత్' ఆధ్వర్యంలో పోటీలు

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'సర్ త్యాగరాయ కళా పరిషత్', 'ఉత్తర మద్రాసు ఉగాది మహోత్సవ కార్య నిర్వాహక వర్గం' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న విశ్వావసు నామ ఉగాది వేడుకలను పురస్కరించుకుని మార్చి 9 నుంచి వివిధ వర్గాల వారికి పోటీలు జరుగనున్నాయి. మార్చి 9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పోతన పద్యాలపై పోటీ జరుగనుంది. ఎల్‌కేజీ-3వ తరగతి వరకు 3 పద్యాలు, 4-6వ తరగతి వరకు 4 పద్యాలు, 7-9వ తరగతి వరకు 5 పద్యాలపై పోటీ జరుగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి 'ఉగాది విశిష్టత' అనే అంశంపై ఉపన్యాస పోటీ జరుగనుంది. ఎల్‌కేజీ-3వ తరగతి వరకు, 4-6వ తరగతి వరకు ఈ పోటీ వుంటుంది. 7 నుంచి 9 తరగతుల వారికి 'సర్ పిట్టి త్యాగరాయ శెట్టి గురించి ఉపన్యాస పోటీ జరుగుతుంది. అదే విధంగా ఉదయం 11.30 గంటల నుంచి ఎల్‌కేజీ-3, 4-6, 7-9 తరగతుల వారికి చిత్రలేఖన పోటీ వుంటుంది. పాతచాకలిపేట నమశ్శివాయవీధిలోని కన్నికలమ్మ దేవాలయ ప్రాంగణంలో ఈ పోటీలన్నీ జరుగనున్నాయి. అయితే 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి పాతచాకలిపేట ఏకాంబరశెట్టివీధిలో వున్న సుబ్బారావు కల్యాణమండపంలో ముగ్గుల పోటీ జరుగనుంది. ఈ పోటీల్లో పాల్గొనదలచినవారు మార్చి 4వ తేదీ లోగా జె.హరికృష్ణ (9080570728, 9444216501), డి.మాధవయ్య (99623 42789), ఎస్.హనుమంతరావ్ (8122642269), ఎంఆర్ఎస్ (9841113393)లను సంప్రదించవచ్చు.

53 ఏళ్ల రోగికి ఎల్‌డీహెచ్ హెపటెక్టమీ విజయవంతం

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'లివర్ సిర్రోసిస్' అనే చివరిదశ వ్యాధితో బాధపడుతున్న కళ్లకుర్చి జిల్లాకు చెందిన 53 ఏళ్ల రోగికి నగరంలోని గ్లెనీగల్స్ హాస్పిటల్ వైద్యులు లాప్రోస్కోపిక్ లివింగ్ డోనర్ హెపటెక్టమీ (ఎల్‌డీహెచ్) అనే కనిష్ట ఇన్వాసివ్ సర్జికల్ టెక్నిక్ విజయవంతంగా పూర్తి చేశారు. లాప్రోస్కోపిక్ పరికరాలను ఉపయోగించి, జీవించివున్న దాత నుంచి కాలేయంలో కొంత భాగాన్ని తొలగించడం ద్వారా ఈ శస్త్రచికిత్స విజయవంతమైంది. రోగి కుమార్తె 22 ఏళ్ల వయసులో కాలేయాన్ని దానం చేయడం విశేషం. డాక్టర్ వివేక్ విజ్, డాక్టర్ జాయ్ వర్గీస్, డాక్టర్ సెల్వకుమార్ మల్లేశ్వరన్ నేతృత్వంలోని నిపుణుల బృందం 8 గంటల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసింది.

- ఆంధ్రలో బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ ...

సరిహద్దుల్లో వాహనాలపై క్రిమినాశిని పిచికారీ



ఆంధ్ర నుంచి వచ్చే వాహనాలపై క్రిమినాశిని మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వ్యాప్తి అధికంగా ఉంటోంది. ఆంధ్ర రాష్ట్రం పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలు, కర్నూల్ జిల్లాల్లోని 30కి పైగా ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి వేలాది కోళ్ల మృతిచెందుతున్నాయి. ఆంధ్ర సరిహద్దు రాష్ట్రం కావడంతో, రాష్ట్రంలోకి బర్డ్ ఫ్లూ వ్యాపించకుండా ఆరోగ్యశాఖ, పశు సంవర్ధక శాఖ అధికారులు ముందు జాగ్రత్తలు చేపట్టారు. ఈ ప్రకారం, ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులైన తిరువళ్లూర్ జిల్లాలోని తిరుత్తణి పొన్‌పాడి, ఊత్తుకోట పెరియపాళ్యం, గుమ్మిడిపూండి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. పశుసంవర్ధక శాఖకు చెందిన ఒక అసిస్టెంట్ డాక్టర్, ఇన్స్‌పెక్టర్, అసిస్టెంట్ మూడు షిఫ్టుల్లో పనిచేస్తూ, ఆంధ్ర రాష్ట్రం నుంచి వచ్చిన వాహనాలను తనిఖీ చేసి, వాటికి క్రిమినాశిని మందు పిచికారి అనంతరమే రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు.

నిండు కుండలా చెంబరంబాక్కం చెరువు

అడయార్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగర వాసుల దాహార్తిని తీర్చే నీటి నిల్వ కేంద్రాల్లో చెంబరంబాక్కం చెరువు ఒకటి. ఈ చెరువు ప్రస్తుతం నిండు కుండలా కనిపిస్తుంది. గత యేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు నగరంలోని అనేక చెరువులు పూర్తిగా నిండాయి. వీటిలో చెంబరంబాక్కం చెరువు కూడా ఉంది. ఈ చెరువు భద్రత దృష్ట్యా ఉపరితల నీటిని విడుదలు చేశారు. దీంతో చెరువు నీటిమట్టం తగ్గిపోయింది. ఇపుడు పూండి రిజర్వాయర్ నుంచి ఈ చెరువుకు రోజుకు 250 ఘనపుటడుగుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ కారణంగా మొత్తం 24 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన చెంబరంబాక్కం నీటి మట్టం ప్రస్తుతం 23.50 అడుగులకు చేరడంతో నిండు కుండలా కనిపిస్తుంది.



వెల్లయంగిరి కొండపై టీవీకే జెండా తొలగింపు



వెల్లయంగిరి కొండపై ఎగురవేసిన టీవీకే జెండా

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వెల్లయంగిరి కొండపై ఎగురవేసిన టీవీకే జెండాను అటవీశాఖ అధికారులు తొలగించారు. కోయంబత్తూర్ పశ్చిమ కనుమల కొండల్లోని పూండి వెల్లయంగిరి ఆండవర్ ఆలయం ఉంది. ఈ ఆలయానికి వెళ్లేందుకు ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి మే నెల వరకు మాత్రమే భక్తులను అనుమతిస్తుంటారు. ప్రస్తుతం వెల్లయంగిరి కొండకు భారీగా వస్తున్న భక్తులు, ఏడో కొండపై ఉన్న స్వయంబు లింగ ఆండవర్‌ను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో, ఆలయం ఉన్న ఏడో కొండపై ఇటీవల సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) జెండా ఎగురవేశారు. సమాచారం అందుకున్న పొలువాడిపట్టి ఫారెస్ట్ రేంజర్ సురేందర్ నేతృత్వంలో సిబ్బంది ఏడో కొండపైకి చేరుకొని టీవీకే జెండాను తొలగించారు. జెండా ఎగురవేసి వారి కోసం అధికారులు విచారిస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

తిరుత్తణి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తాలూకా స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులను జిల్లా వెల్ఫేర్ బోర్డులో చేర్చాలని కోరుతూ తమిళనాడు జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. తిరువళ్లూర్ జిల్లాలో సుమారు వంద మంది జర్నలిస్టులున్నారు. వీరిలో ఎక్కువ మంది తాలూకా స్థాయిలో పనిచేస్తుండగా, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వారికి అందడం లేదు. ఈ క్రమంలో, తమిళనాడు జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ గా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ... జర్నలిస్టులను అన్నివిధాలా ఆదుకొనేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నేరి బాలకృష్ణన్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా కార్యదర్శి తమిళన్, తిరువళ్లూర్ తూర్పు జిల్లా అధ్యక్షుడు మిల్టన్, కార్యదర్శి అరుళ్, దక్షిణ చెన్నై జిల్లా అధ్యక్షుడు అక్బణన్ తదితరులు పాల్గొన్నారు. తిరువళ్లూర్ పశ్చిమ జిల్లా ప్రతినిధి మణికందన్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



కలెక్టర్ ప్రతాప్‌కు వినతిపత్రం సమర్పించిన జర్నలిస్టులు

ఉపాధి హామీ పథకానికి రూ.3,252 కోట్లు ఇవ్వండి

- కేంద్రానికి మంత్రి పెరియస్వామి విజ్ఞప్తి

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకానికి రూ.3,252 కోట్లు విడుదల చేయాలని కేంద ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రి ఐ.పెరియస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్రంలోని 37 జిల్లాల్లో 12,525 పంచాయతీల్లో అమలువుతోందన్నారు. 2024-25వ ఆర్థిక సంవత్సరంలో 20 కోట్ల రోజులు పనిదినాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఆ ప్రకారం, ఇప్పటివరకు 28.45 కోట్ల పనిదినాలు చేపట్టామని, ఈ పనుల్లో 86 శాతం మహిళలు, 26 శాతం ఆదిద్రావిడులు, 1.63 శాతం గిరిజనులు ఉపాధి పొందుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం సక్రమంగా నిధులు విడుదల చేయడం లేదన్నారు. దీంతో, లబ్దిదారులకు వేతనాలు అందించడంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. ఈ పథక లబ్దిదారులు చెల్లించాల్సిన రూ.2,400 కోట్లు, పథకంలో చేపట్టిన మౌలిక వసతుల కల్పనకు రూ.852 కోట్లు చొప్పున మొత్తం రూ.3,252 కోట్లు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఇప్పటికే ప్రధానికి లేఖ రాశారని, త్వరలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిని స్వయంగా కలుసుకొని నిధులు విడుదల చేయాలని కోరనున్నట్లు మంత్రి పెరియస్వామి తెలిపారు.

కుత్తంబాక్కం బస్ టెర్మినల్ ప్రారంభానికి సిద్ధం

ప్యారీస్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): చెన్నై - బెంగుళూరు జాతీయరహదారిలోని పూందమల్లి సమీపంలోవున్న కుత్తంబాక్కం బస్ టెర్మినల్ ప్రాంతంలో రూ.427కోట్లతో ఆధునిక హంగులతో నిర్మిస్తున్న బస్ టెర్మినల్ వచ్చే నెల అందుబాటులోకి రానుంది. రాజధాని నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా ప్రస్తుతం కొత్త బస్ టెర్మినల్‌ను సీఎండీఏ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా కీలాబాక్కం కొత్త బస్ టెర్మినల్ నుండి దక్షిణ జిల్లాలకు బస్సులు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో పూందమల్లి బస్ స్టేషన్ నుండి నగరంలోని ఆవడి, బ్రాడ్‌వే, తాంబరం, కోయంబేడు, మాధవరం తదితర ప్రాంతాలకు ప్రతిరోజు సుమారు 150 సిటీ బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సులను మార్చి నుండి కుత్తంబాక్కం కొత్త బస్ టెర్మినల్ నుండి నడపనున్నారు. అదే సమయంలో పూందమల్లి బస్‌స్టేషన్‌ను ఎలక్ట్రిక్ బస్సు మరమత్తుల కేంద్రంగా మార్పు చేయనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు.

బీజేపీకి నటి రంజనా నాచ్చియార్ గుడ్‌బై



చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కళా సాంస్కృతిక విభాగ కార్యదర్శి, నటి రంజనా నాచ్చియార్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఎనిమిదేళ్లపాటు పార్టీ కోసం తీవ్రంగా పాటుపడ్డానని, దేశభక్తి కలిగిన, జాతీయవాదాన్ని పరిరక్షించే, ఆధ్యాత్మిక భావాలు కలిగిన పార్టీ అనే నమ్మకంతో బీజేపీలో చేరానని తెలిపారు. అయితే ఆ పార్టీ రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా విస్మరిస్తోందని గ్రహించానన్నారు. దేశం వేరు రాష్ట్రం వేరు అనే విరుద్ధభావాలు కలిగిన పార్టీలో తమిళ మగువ కొనసాగకూడదని పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశానని వెల్లడించారురు. రాష్ట్రంలో త్రిభాష విద్యావిధానాన్ని అమలు చేయాలని ఒత్తిడి చేయడం, నిర్బంధ హిందీని దొడ్డిదారిలో అమలు చేయాలని ప్రయత్నించడం వంటి ఘటనలు చూసి సహించలేకపోయానన్నారు. రంజనా నాచ్చియార్ కొన్నేళ్ల క్రితం ఎంటీసీ బస్సులో ఫుట్‌బోర్డులో ప్రయాణం చేసిన విద్యార్థులపై దాడి చేసి తీవ్ర కలకలం రేపారు. ఆ కేసులో అరెస్టు కావడాన్ని కూడా ఆమె సమర్థించుకున్నారు. మంచి విషయాల కోసం అరెస్టు కావడంలో తప్పులేదని ప్రకటించారు. ఆ కేసులో అరెస్టయి బెయిలుపై విడుదలయ్యారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- టీచర్ అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపంలోని ఓ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ఆరుగురు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై సోమవారం బాధిత విద్యార్థినులు చైల్డ్ హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు జిల్లా పిల్లల సంక్షేమ అధికారి నేతృత్వంలోని బృందం సంబంధిత పాఠశాలకు వెళ్లి బాధిత విద్యార్థులను విచారించగా, విద్యార్థినులపై సంబంధిత ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంపై పిల్లల భద్రత శాఖ అధికారి ఫిర్యాదుతో పోలీసులు, పోక్సో సహా నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి టీచర్‌ను అరెస్ట్ చేసారు.

చేతబడి చేయాలంటూ జీ పే ద్వారా చెల్లింపు

- మాంత్రికుడి సహా ఇద్దరు అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చేతబడి చేసి హతమార్చాలంటూ గూగుల్ పే ద్వారా రూ.21 లక్షలు పంపిన వ్యవహారంలో మాంత్రికుడి సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళ స్వస్థలం కలిగిన రఘు, ప్రస్తుతం చెన్నైలో మాంత్రికుడుగా చెలామణి అవుతున్నాడు. అలాగే, యూ ట్యూబ్ ఛానల్ ప్రారంభించి అందులో మంత్రాల గురించి వీడియోలు చేస్తుంటారు. అలా, అతని సాయం కోరిన వారి నుంచి గూగుల్ పే ద్వారా నగదు వసూలుచేస్తుంటాడని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, పెరంబలూరు దురైమంగళం ప్రాంతానికి చెందిన రమేష్‌కృష్ణ, అదే ప్రాంతానికి చెందిన సిబి అనే మురసోలి మారన్ అనే వ్యక్తిని చేతబడి చేసి హతమార్చాలని సుమారు రూ.21 లక్షలు గూగుల్ పే ద్వారా రఘుకు పంపినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న సిబి, పెరంబలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, రఘు, రమేష్‌కృష్ణలను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

గంజాయి విక్రేతకు ఐదేళ్ల జైలు శిక్ష

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి బస్టాండ్‌లో గంజాయి విక్రయించిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. గిండి పోలీసులకు అందిన సమాచారంతో 2023లో గిండి బస్టాండ్‌లో పోలీసులు ప్రత్యేకంగా గస్తీ పెట్టారు. ఆ సమయంలో అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. అతను తిరుచ్చికి చెందిన శరవణన్ అని తెలుసుకున్న పోలీసులు, అతని బ్యాగులో 10 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారించిన చెన్నై మాదకద్రవ్యాల నిరోధక కోర్టు న్యాయమూర్తి గోవిందరాజన్, నిందితుడు శరవణన్‌కు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

రూ.9.25 కోట్లతో మినీ మార్ట్, కమ్యూనిటీ హాలు

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూర్ మండలం 196వ వార్డు ఎళిల్ నగర్, సునామీ క్వార్టర్స్‌లో మినీ మార్ట్, కమ్యూనిటీ హాలు నిర్మించాలని నిర్ణయించిన సీఎండీఏ, అందుకోసం రూ.9.25 కోట్లు కేటాయించింది. మినీ మార్ట్‌లో ఈ-సేవా కేంద్రం, టైలర్ దుకాణం, మెడికల్ షాపు, బుక్స్ అండ్ స్టేషనరీ దుకాణాలు ఏర్పాటుచేయనున్నారు. అలాగే కమ్యూనిటీ హాల్‌లో వృత్తి శిక్షణ, ట్యూషన్ సెంటర్, సేవా కేంద్రం తదితరాలకు వినియోగించనున్నారు. ఈ రెండు పనులు ఆరు నెలల్లో పూర్తిచేయాలని నిర్ణయించినట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు.

రాష్ట్ర రైతులకు రూ.471 కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి రైతు ప్రోత్సాహక నిధి పథకంలో, రాష్ట్రానికి చెందిన రైతులకు రూ.471 కోట్లు విడుదల చేశారు. దేశవ్యాప్తంగా రైతులకు సాగు జరగని సమయంలో, వారిని ఆదుకొనేలా ప్రధాని రైతు ప్రోత్సాహక నిధి పథకం 'పీఎం కిసాన్' పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. ఈ పథకంలో మూడు విడతలుగా తలా రూ.2,000 చొప్పున ఏడాదికి రూ.6,000 రైతుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తుంటారు. ఈ ప్రకారం, 19వ విడతగా ప్రధాని మోదీ ఆదివారం ఈ నిధులు విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 9.80 కోట్ల మంది రైతులకు రూ.22,000 కోట్లు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు. ఆ ప్రకారం, రాష్ట్రానికి చెందిన 2.25 లక్షల మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.471 కోట్లు జమచేసినట్లు అధికారులు తెలిపారు.

మాంజా దారం విక్రయాలపై నిషేధం పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లో మాంజా దారం వినియోగించి గాలిపటాలు ఎగురవేయడంపై ఇదివరకే నిషేధం అమలులో ఉంది. ఈ నిషేధం ఏప్రిల్ 24వ తేది వరకు పొడిగించారు. ఈ కాలంలో, మాంజా దారం వినియోగించి గాలిపటాలు ఎగురవేయడం, విక్రయించడం తదితరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు. అలాగే, మానవరహిత విమానం, డ్రోన్ ఎగురవేయడంపై నిషేధం విధించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ప్రకటన విడుదల చేసింది.

తాంబరంలో విలువిద్య పోటీలు ప్రారంభం



విలువిద్య పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ప్యారీస్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలో తమిళనాడు విలువిద్య సంఘం ఆధ్వర్యంలో 18వ రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం సహా 34 జిల్లాల నుండి సుమారు 2వేల మందికి పైగా విలువిద్యలో ప్రావీణ్యం పొందిన క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటనున్నారు. 10,13,15 ఏళ్ల లోపు మూడు కేటగిరీల్లో నిర్వహించే ఈ పోటీల్లో తలా ముగ్గురిని ఎంపిక చేసి పతకాలు పంపిణీ చేయనున్నట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి షిహాన్ హుస్సేనీ తెలిపారు.

మూడు రోజులు జీసీసీ ఆన్‌లైన్ సేవల నిలిపివేత

వేపేరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆన్‌లైన్ సేవలకు మూడు రోజుల పాటు అంతరాయం కలుగనుంది.. ఈ మేరకు జీసీసీ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... ఇంటర్నెట్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 28 రాత్రి 10 గంటల నుంచి మార్చి 2వ తేది రాత్రి 10 గంటల వరకు ఆన్‌లైన్ సేవలు ఉండబోవని జీసీసీ తెలిపింది.

ముక్కంటికి ప్రీతికరం...
భక్తకోటికి మహాపర్వదినం

● ముక్తిని ప్రసాదించే మహాశివరాత్రి

ఆంధ్రజ్యోతి, చెన్నై

ఓ ప్రళయ కాలంలో బ్రహ్మదేవుడు, ఆయన సృష్టించిన అన్ని జీవరాశులు పరమాత్మలో ఐక్యమొందాయి. ఆ రోజు రాత్రి పరమేశ్వరుడి అనుగ్రహం కోసం పార్వతీదేవి పూజ చేసింది. నాలుగు జాములపాటు అర్చనలు జరిపారు. సూర్యాస్తమయం నుండి మరుసటి రోజు సూర్యోదయం వరకు పార్వతీదేవి పతిదేవుడి అనుగ్రహం కోసం చేసిన కాలాన్నే 'మహా శివరాత్రి' అని పిలుస్తున్నారు. ఈ శివరాత్రి పూజా కార్యక్రమాలు ముగియగానే పరమేశ్వరుడు ప్రత్యక్షమై పార్వతిని దీవించారు. ఆ సందర్భంగా పార్వతీదేవి 'స్వామీ... శివరాత్రి రోజున నాలుగు జాములపాటు మిమ్మల్ని ఆరాధించేవారికి సకల సౌభాగ్యాలు కల్పించాలి. అంతేకాకుండా వారి అవసాన దశలో ముక్తి కూడా ప్రసాదించాలి' అని వేడుకుంది. అందుకు భోళాశంకరుడు 'తథాస్తు' అన్నాడు. ప్రతి నెలలో మాసశివరాత్రి వచ్చినా, పార్వతీదేవి పరమశివుడిని ఆరాధించిన రోజునే 'మహా శివరాత్రి'గా పరిగణిస్తున్నారు.



బృహదీశ్వరాలయంలో మహాలింగేశ్వరుడు

శివరాత్రి వ్రతమాచరించి లబ్ధి పొందినవారు...

తన అనుగ్రహం కోసం శివరాత్రి పూజ చేసిన పార్వతీ దేవికి తన దేహంలో సగభాగాన్ని ఇచ్చి అర్ధనారీశ్వరుడైన సంగతి అందరికీ తెలిసిన విషయమే.

శివరాత్రి పూజ చేసిన అర్జునుడికి పరమేశ్వరుడు పాశుపతాస్త్రాన్ని అనుగ్రహించారు.

ప్రతిఫలాపేక్ష లేకుండా పరమశివుడి కోసం తన రెండు కళ్ళనే దానం చేసిన కన్నప్పకు మోక్షం లభించింది. భక్తకన్నప్ప శివగతి పొందినది శివరాత్రి రోజే.

భగీరథుడు తన పూర్వీకులకు సద్గతి కోసం శివరాత్రి పూజ చేసే గంగను పుడమికి తెచ్చారు.


యమపాశాన్ని దహనం చేసి భక్త మార్కండేయుడిని పరమేశ్వడు రక్షించిన రోజు కూడా శివరాత్రి పర్వదినమే కావటం విశేషం. ఇంతటి మహిమాన్వితమైన మహాశివరాత్రి వ్రతాన్ని ఆచరించడానికి, ఆలయాల్లో జరిగే వేడుకల్లో భక్తులంతా పాల్గొంటున్నారు.

వ్రతం ఎలా ఆచరించాలి?

శివరాత్రికి ముందు రోజు ఏకభుక్తం చేయాలి. శివరాత్రి రోజున వేకువజామునే లేచి సూర్యోదయ సమయానికికల్లా ఇంటిలో పూజ ముగించాలి. ఆ తర్వాత దగ్గరగా ఉన్న శివాలయానికి వెళ్ళి శివలింగాన్ని దర్శించాలి. సాయంత్రం ఇంటిలో పూజచేసే స్థలాన్ని అలంకరించి. శివుడికి అర్చన చేసేందుకు సామగ్రితో శివాలయానికి వెళ్ళాలి. ఆ ఆలయంలో నాలుగు జాముల పూజల్లో పాల్గొని, పరమేశ్వరుడికి జరిపే అభిషేకం, అలంకరణ తిలకించాలి.. ఆ సమయంలో 'ఓం నమః శ్శివాయ' అని ఉచ్చరిస్తూ ఉండాలి. రాత్రంతా శివనామ స్మరణతో జాగారం చేయాలి. ఆలయానికి వెళ్లలేనివారు ఇంటి వద్దే నాలుగు జాములపాటు పరమశివుడికి పూజలు చేసి, బిల్వదళాలతో అర్చించాలి. ఈ వ్రతాన్ని ఆచరించేవారు. కోపాన్ని కట్టడి చేసుకోవాలి. ఇంటిలో శివరాత్రి పూజ చేసే సమయంలో పరమేశ్వరుడి ద్విదశ నామాలను పఠిస్తూ స్వామిని పూజించాలి. ఆలయానికి వెళ్ళేవారు. ప్రదక్షిణ చేసి మూల మంత్రాన్ని 108సార్లు పఠించాలి. పూజ చేయలేనివారు నాలుగు జాములపాటు శివపురాణం వింటే చాలు. శివాలయానికి వెళ్లి రాత్రంతా జరిగే పూజలలో పాల్గొనవచ్చు. 24 యేళ్లపాటు వరుసగా శివరాత్రి వ్రతమాచరించేవారు. శివ సాన్నిధ్యం పొందుతారనేది ఐతిహ్యం.

ఆద్యంతమూ ఈశ్వరుడే...

పూర్వం త్రిమూర్తుల్లో మహావిష్ణువుకు, బ్రహ్మదేవుడికి మధ్య తమలో ఎవరు గొప్ప అనే విషయం పోటీ ఏర్పడింది. ఆ సమయంలో పరమశివుడు వారి ఎదుట ఆది అంతమూ కనిపించనంత ఎత్తున జ్యోతి స్వరూపుడిగా నిలిచారు. జ్యోతి స్వరూపుడైన పరమేశ్వరుడి అడుగు భాగాన్ని లేదా శిరోభాగాన్ని ఎవరైతే ముందుగా వీక్షిస్తారో వారే గొప్పవారంటూ విజ్ఞులు తెలిపారు. దీంతో హంసరూపంలో బ్రహ్మదేవుడు పరమేశ్వరుడి శిరోభాగాన్ని చూసేందుకు బయలుదేరాడు. ఇక మహావిష్ణువు వరాహరూపంలో ఈశ్వరుడి



అర్ధనారీశ్వరుడి విగ్రహం

పాదాలు చూడాలని పయనమయ్యారు. ఆ తరువాత ఈశ్వరుడి పాదాన్ని దర్శించలేకపోయానని మహావిష్ణువు అంగీకరించడం, అదే సమయంలో బ్రహ్మదేవుడు పరమేశ్వరుడి శిరస్సు చూశానంటూ, మొగలిపువ్వుచేత తప్పుడు సాక్ష్యమిప్పించిన కథ అందరికీ తెలిసిందే. బ్రహ్మ, మహావిష్ణువు ఎదుట జ్యోతి స్వరూపుడైన నిలిచిన ఈశ్వరుడి రూపాన్నే 'లింగోద్భవ రూపం' అని పిలుస్తున్నారు. ఇలా లింగోద్భవ రూపంతో పరమేశ్వరుడు బ్రహ్మ, విష్ణువుకు మహాశివరాత్రి రోజునే దర్శమిచ్చారని చెబుతారు. శివరాత్రి వ్రతాన్ని ఎవరైనా ఆచరించించవచ్చునని, ఈ వ్రతానికి ఎలాంటి కట్టుబాట్లు కూడా లేవని శైవాగమ పండితులు చెబుతారు. యేడాది పొడవునా వ్రతమాచరిస్తే, వంద అశ్వమేథయాగాలు చేస్తే, వేల సార్లు గంగలో స్నానమాచరిస్తే ఎంత పుణ్యఫలం దక్కుతుందో, శివరాత్రి వ్రతమాచరిస్తే అంతకు వేయిరెట్లు పుణ్యం లభిస్తుందని, శైవ భక్త శిఖామణులు పేర్కొంటారు.



నాగాభరణ శివలింగం



చలువరాతి శివపార్వతులు





అర్ధనారీశ్వరుడు

షూటింగ్ ముగింపు వేడుకల్లో చిత్రబృందం



విజయ్ సేతుపతి చిత్రం
షూటింగ్ పూర్తి

విజయ్ సేతుపతి - నిత్యా మేనన్ జంటగా పాండిరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్ర షూటింగ్ పూర్తి చేసుకున్నట్టు యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఇతర పాత్రల్లో సెంబియన్ వినోద్, ఆర్కే సురేష్, యోగిబాబు తదితరులు నటించారు. సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో రూపొందించిన ఈ చిత్రం షూటింగ్ గత యేడాది ప్రారంభించగా, చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్టు తాజాగా ప్రకటించారు. షూటింగ్ మొత్త తిరుచ్చి, దాని పరిసర ప్రాంతాల్లో జరిపారు. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ మూవీ డబ్బింగ్, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను పూర్తి చేసుకుని త్వరలో విడుదల చేయనున్నట్టు దర్శక నిర్మాతలు ప్రకటించారు. అలాగే, అతి త్వరలో అంటూ డిజైన్ చేసిన ఫస్ట్‌లుక్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. కాగా, కుటుంబ కథా చిత్రాలను తెరకెక్కించడంలో దర్శకుడు పాండిరాజ్‌ది ప్రత్యేక శైలి. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పైగా ఇది విజయ్ సేతుపతి నటించే 52వ చిత్రం కాగా, 2025లో విజయ్ సేతుపతి నటించిన 'ఏస్', 'ట్రైన్' చిత్రాల తర్వాత విడుదలకానున్న మూడో చిత్రం ఇది.

ఇప్పటివరకు చూడని జోనర్‌లో 'కింగ్‌స్టన్' : జీవీ ప్రకాష్



తాను హీరోగా నటించి, నిర్మించిన 'కింగ్‌స్టన్' మూవీ ఇప్పటివరకు ఏ ఒక్కరూ చూడని జోనర్‌లో రూపొందించినట్టు ఆ చిత్ర హీరో, నిర్మాత జీవీ ప్రకాష్ కుమార్ తెలిపారు. జీ స్టూడియోస్‌తో కలిసి ఆయన సొంతంగా నిర్మించిన ఈ సినిమాకు కమల్ ప్రకాష్ దర్శకత్వం వహించగా, దివ్యభారతి హీరోయిన్. సేత్తన్, అళగం పెరుమాళ్, ఇళంగో కుమరవేల్ వంటి పలువురు ప్రముఖ నటీనటులు నటించారు. ఈ చిత్రం గురించి జీవి మాట్లాడుతూ, 'ఇది ఒక రెగ్యులర్ మూవీ కాదు. గొప్ప సినిమా అనుభవాన్ని ఇచ్చేలా ఉంటుంది. హాలీవుడ్ చిత్రాల స్థాయిలో భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందించాం. ఇందులో అనేక సర్‌ప్రైజ్‌లు ఉంటాయి. ఇలాంటి చిత్రాలకు గ్రాఫిక్స్ ఎంతో కీలకం. సాధారణ చిత్రాలకు అయ్యే ఖర్చు కంటే నాలుగు రెట్లు అధికంగా బడ్జెట్ అయింది. సొంతంగా నిర్మాణ సంస్థ పారంభించడం వల్ల ఒక స్క్రిప్టును అనుకున్న రీతిలో తెరకెక్కించే వెసులుబాటు లభించిందని వివరించారు.

ప్రభాస్ కోసమే అలాంటి నిర్ణయం

● మాళవికా మోహనన్



కోలీవుడ్‌లోని పలువురు అగ్రహీరోలతో నటించిన మాలీవుడ్ భామ మాళవికా మోహన్.. టాలీవుడ్ మోస్ట్ బ్యాచిలర్ ప్రభాస్ సినిమాలో నటించాలన్న ఏకైక లక్ష్యంతో ఎలాంటి షరతులు పెట్టలేదని చెప్పుకొచ్చారు. ప్రభాస్ సరసన నటించాలన్న ఏకైక లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, 'సాధారణంగా పెద్ద హీరోల చిత్రాల్లో కథానాయికలకు తక్కువ నిడివి లేదా అప్రధాన్య పాత్రలు ఇస్తుంటారు. కానీ, 'ది రాజాసాబ్' మూవీలో బిగినింగ్ నుంచి ఎండింగ్ వరకు వస్తాను. పైగా నేను ఇప్పటివరకు నటించని హర్రర్ కామెడీ మూవీ. అందుకే ఈ మూవీ ఛాన్స్ మిస్ చేసుకోరాదన్న కృతనిశ్చయంతో ఉన్నాను. పెద్ద హీరో, భారీ బడ్జెట్ చిత్రంలో ఇలాంటి పాత్ర చాలా అరుదుగా వస్తుంది. అందుకే ఎలాంటి కండిషన్లు పెట్టకుండా నటించాను' అని పేర్కొన్నారు. కాగా, మాళవికా మోహనన్ తమిళంలో 'పేట', 'మాస్టర్', 'మారన్', 'తంగలాన్' వంటి అగ్రహీరోల చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకున్న విషయం తెల్సిందే.

ఇమ్మాన్‌తో కాలు కదిపిన ఆండ్రియా



ఆండ్రియా, ఇమ్మాన్

తమిళ చిత్రజ్యోతి

ఏఆర్ ఎంటర్‌టైన్మెంట్ నిర్మాణంలో లోకేష్ అజిల్స్ దర్శకత్వంలో రూపొందుతున్న 'లెవెన్' మూవీ కోసం సంగీత దర్శకుడు డి.ఇమ్మాన్‌తో కలిసి ప్రముఖ హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య డ్యాన్స్ చేశారు. ఈ పాట ప్రముఖ యూట్యూబ్ చానెల్ సరిగమలో రిలీజ్ చేశారు. తమిళం, తెలుగు భాషల్లో రూపొందిన ఈ చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఆసక్తికరంగా సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీలో కథ డిమాండ్ మేరకు ఈ పాట చిత్రీకరించడం జరిగింది. తమిళం, తెలుగు భాషల్లో తీయడంతో గేయ రచన కూడా ఆయా భాషలకు చెందిన రచయితలతో రాయించి, నేపథ్యగానం చేయించాం. వేసవి సెలవులకు చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం. కాగా, 'సిల నేరంగలిల్ సిల మణిదర్‌గల్', 'సెంబి' వంటి వైవిధ్యభరితమైన చిత్రాల తర్వాతే ఏఆర్ ఎంటర్‌టైన్మెంట్ నిర్మించే మూడో చిత్రం' అని వెల్లడించారు. దర్శకుడు సుందర్ సి వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన లోకేష్ అజిల్స్ ఈ మూవీ ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

కోవై చేరిన అమిత్‌షా



● 7 వేల మందితో బందోబస్తు

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరులో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మూడు రోజుల పర్యటన నేపథ్యంలో ఏడు వేలమంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. మంగళవారం రాత్రి ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కోయంబత్తూరు చేరుకున్నారు. బీజేపీ స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి ఆయన కారులో బయలుదేరి అవినాశి రోడ్డులో ఉన్న స్టార్ హోటల్‌లో బసచేశారు. ఆ సందర్భంగా కొంగుమండలానికి చెందిన ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో ఆయన భేటీ అయ్యారు. బుధవారం ఉదయం పీలమేడులో కొత్తగా నిర్మించిన బీజేపీ మహానగర, జిల్లా కార్యాలయాలను ప్రారంభిస్తారు. అదే సమయంలో రామనాథపురం, తిరునల్వేలిలో నిర్మించిన పార్టీ కార్యాలయాలను దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభిస్తారు. ఆ తర్వాత బీజేపీ రాష్ట్రస్థాయి నేతలతో సమావేశమవుతారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ గవర్నర్ తమిళిసై, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ తదితరులు పాల్గొంటారు. సాయంత్రం ఈషా కేంద్రంలో జరిగే మహాశివరాత్రి వేడుకలలో పాల్గొంటారు. అనంతరం మళ్ళీ కోయంబత్తూరు నగరానికి వచ్చి స్టార్ హోటల్‌లో రాత్రి బసచేస్తారు. గురువారం ఉదయం 9 గంటలకు కోయంబత్తూరు నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ఈ నేపథ్యంలో అమిత్‌షా బసచేస్తున్న స్టార్‌హోటల్, ఈషా కేంద్రం వద్ద, కొత్త బీజేపీ కార్యాలయాల వద్ద, విమానాశ్రయం వద్ద సుమారు 7 వేల మంది పోలీసులతో గట్టి భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

కొడైకెనాల్ ఫుల్

● సెలవులు ముగిసినా తగ్గని పర్యాటకుల రద్దీ



కొడైకెనాల్ సరస్సులో బోట్ సవారీ చేస్తున్న పర్యాటకులు

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతంలో కొడైకెనాల్‌లో ప్రస్తుతం చల్లటి వాతావరణం నెలకొనటంతో వారాంతపు సెలవులు ముగిసిన తర్వాత కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. స్టార్ సరస్సులో ఫౌంటెన్లను, ఉద్యానవనాలను సందర్శించేందుకు పర్యాటకులు పోటీపడుతున్నారు. మంగళవారం ఉదయం బోట్ సవారీ చేయడానికి వందల సంఖ్యలో పర్యాటకులు బారులు తీరారు. దీనితో బోట్ సవారీ చేయడానికి గంట నుండి రెండు గంటల దాకా వేచి ఉండాల్సి వచ్చింది. ఉద్యానవనాల్లోనూ పర్యాటకుల సందడి అధికమైంది.

కెమిన్ ఆక్వాసైన్స్‌కు అవార్డు



కేంద్రమంత్రి జితిన్ ప్రసాద నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఎం.రాజలక్ష్మి, సైంటిస్ట్ హరికుమార్

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక దృక్పథంతో రొయ్యలసాగులో రోగ నిరోధం కోసం పేతరోల్ పేరుతో కొత్త రకం మందు కనుగొన్న కెమిన్ ఆక్వాసైన్స్ సంస్థకు 15వ ఏజీసీ గ్రాహమ్ బెల్ అవార్డు లభించింది.. కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్ ఈ అవార్డును సంస్థ గ్లోబల్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాజలక్ష్మి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేట్ సైంటిస్ట్ హరికుమార్‌కు అందజేశారు. రొయ్యలసాగుకు హానిచేసే 'ఈహెచ్‌పీ' అనే వ్యాధి నుండి ఈ కొత్త రకం పేతరోల్ కాపాడగలుగుతుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు.



బాక్సింగ్ అకాడమీని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

గోపాలపురంలో బాక్సింగ్ అకాడమీ ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోపాలపురంలో రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.8 కోట్లతో నిర్మించిన కలైంజర్ శత జయంతి స్మారక బాక్సింగ్ అకాడమీని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. 890 సీట్ల కెపాసిటీ, ఏసీ ఇండోర్ స్టేడియం, ట్రైనింగ్ స్టేడియం, వ్యాయామశాల, కోచ్‌ల గది, మెడికల్ సెంటర్ తదితర సదుపాయాలతో ఈ బాక్సింగ్ యూనిట్ నిర్మించినట్లు స్టాలిన్ తెలిపారు. బాక్సింగ్ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా 48 నుంచి 51 కేజీల విభాగంలో యువతుల మధ్య జరిగిన బాక్సింగ్ పోటీలను ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి పీకే శేఖర్‌బాబుతో పాటు ఆసక్తిగా వీక్షించారు. పోటీలో గెలిచిన విజేతకు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ దయానిధి మారన్, ఎమ్మెల్యేలు డాక్టర్ ఎన్.ఎళిలన్, ఎ.వెట్రి అళగన్, తాయగం కవి, ఎబినేజర్, హసన్ మౌలానా, పరంధామన్, ఎంకే మోహన్, జోసెఫ్ సామువేల్, ఆర్డీ శేఖర్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు ఎన్.సిట్రరసు, యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అతుల్యమిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జే మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదురగిరికి పోటెత్తిన భక్తులు



కొండ మార్గంలో ఆలయానికి వెళ్తున్న భక్తులు

పెరంబూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాసి నెల ప్రదోషం సందర్భంగా విరుదునగర్ జిల్లా చదురగిరి సుందరమహాలింగం ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తున్నారు. ప్రదోషం, అమావాస్య సందర్భంగా మంగళవారం నుంచి 28వ తేది వరకు చదురగిరి ఆలయానికి భక్తులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. ఆ ప్రకారం, సోమవారం రాత్రికే భక్తులు చదురగిరి ఆలయ కొండ ప్రవేశ ద్వారం వద్దకు చేరుకున్నారు. సమయం అవుతున్న కొద్దీ భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం 6 గంటల నుంచి భక్తులను కొండ మార్గంలోనికి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అనుమతిస్తామనే అధికారుల ప్రకటనతో, భక్తులు ఆలయానికి వెళ్లేందుకు పోటీపడ్డారు. రాత్రి వేళల్లో ఆలయం, అటవీ ప్రాంతాల్లో జలపాతాలు, మైదానాల్లో భక్తులు బసచేసేందుకు అనుమతి లేదని అధికారులు ఇదివరకే ప్రకటించారు. కాగా, మహాశివరాత్రి సందర్భంగా కొండ మార్గానికి అనుమతించే సమయం పెంచాలని భక్తులు కోరుతున్నారు.



ప్రవేశ ద్వారం వద్ద భక్తుల రద్దీ

స్కైలైన్ వర్సిటీకి 'సిమట్స్' విద్యార్థులు

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'సిమట్స్' ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పదిమంది విద్యార్థుల బృందం షార్జాలో వున్న స్కైలైన్ విశ్వవిద్యాలయంలో క్రెడిట్ కోర్సుకు హాజరుకానున్నారు. అదే విధంగా దుబాయ్‌లోని కర్టిన్ విశ్వవిద్యాలయంలో జరిగే అంతర్జాతీయ సమావేశానికి సుమారు 25 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వున్న అనేక ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలతో సిమట్స్ అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల్లో భాగంగానే సిమట్స్ విద్యార్థులు అంతర్జాతీయ వర్సిటీల్లో కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు, సమావేశాల్లో పాల్గొనగలుగుతున్నారు. ఆయా విద్యార్థులను సిమట్స్ నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.



సిమట్స్ నిర్వాహకులతో విద్యార్థులు

మోటారు సైకిళ్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

● 9 బైక్‌ల స్వాధీనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట పరిసరాల్లో మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6.65 లక్షల విలువ చేసే 9 బైకులను స్వాధీనం చేసుకొన్నారు. ఈ వివరాలను సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు మంగళవారం మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని బాపూజీ కాలనీ చెందిన ఇట్టా మహేంద్ర, షేక్ ఉజామ, కుదిరి తిప్పకండ్రిగకు చెందిన వంశీ.. ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ఇళ్ల ముందు, రైల్వేస్టేషన్ సమీపంలో నిలిపివున్న మోటరు సైకిళ్లను చోరీ చేసేవారు. వాటిని తమిళనాడులో విక్రయించేవారు. సోమవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న మహేంద్ర, షేక్ ఉజామ, వంశీని పోలీసులు విచారించగా బైకుల చోరీ విషయం బయటపడింది. వారిచ్చిన సమాచారంతో బాపూజీ కాలనీ సమీపంలో పాడుపడిన ఇళ్ల వద్ద దాచి ఉంచిన 9 మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వంశీ 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. చోరీ చేసిన బైక్‌లను తీసుకెళ్లేందుకు తమిళనాడులో ఓ ముఠా ఉందని, త్వరలో వారినీ పట్టుకుంటామని సీఐ చెప్పారు.

తిరుమలలో కన్నప్ప బృందం



శివబాలాజీ, మంచు విష్ణు

తిరుమల శ్రీవారిని మంగళవారం కన్నప్ప సినిమా బృందం దర్శించుకుంది. హీరో మంచు విష్ణు, నటుడు శివ బాలాజీ, ఇతర చిత్ర బృంద సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఎంపీ జయరాం రమేష్, ఎమ్మెల్యే గణబాబు, నటి నిహారిక, నవ్య కూడా స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





నిహారిక - నవ్య


హుండీ ఆదాయం 4..14 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.14 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,764

తలనీలాలు సమర్పించినవారు: 23,504



క్యూలైన్లలోకి ప్రవేశం ఇలా..

భక్తులు వేర్వేరుగా ఆయా క్యూలైన్లలో ప్రవేశించేలా ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రకారం. ఆలయ 1వ గేటు నుంచి ఉచితక్యూలైన్, 2వ గేటు నుంచి రూ.200క్యూలైన్, మూడో గేటు నుంచి రూ.500 క్యూలైన్, 4వ గేటు నుంచి వీఐపీ ప్రవేశమార్గం కోసం క్యూలైన్లను పకడ్బందీగాసిద్ధం చేశారు. వీఐపీల ప్రవేశ ద్వారం వద్ద ప్రత్యేక లాంజ్‌లను సిద్ధం చేశారు. ఇక, సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆర్డీవో, ఈవో పర్యవేక్షణలో పరిమిత సంఖ్యలో వీఐపీలను దర్శనానికి పంపేలా ఏర్పాటు చేశారు.



ఆలయం లోపలా పక్కాగా..

ఆలయం లోపల ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయి గందరగోళ పరిస్థితులకు తావులేకుండా చర్యలు చేపట్టారు. మహద్వారంనుంచి స్వామివారిసన్నిధి, అక్కడి నుంచి అమ్మవారి గర్భగుడి వరకు క్యూలైన్లను ప్రణాళిక బద్ధంగా ఉంచారు. అమ్మవారి దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వెనుక వైపు నుంచి మెట్ల మార్గం ద్వారాదక్షిణగోపురం వద్దకు భక్తులు వెలుపలకు వచ్చేలా ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయే అవకాశం లేదు. ఇక, అడ్డదారి దర్శనాలకు తావులేకుండా దక్షిణగోపురం, మహద్వారం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తును కేటాయించారు.





ముక్కంటి మహాశివరాత్రికి సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తీశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినానికి సర్వం సిద్ధమైంది. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సుమారు 1.5 లక్షల మంది భక్తులకు దర్శన సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది తొలిసారిగా భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. దర్శనానంతరం దక్షిణ గాలిగోపురం నుంచి భక్తులందరూ వెలుపలకు వచ్చేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు ప్రసాదాల కౌంటర్లను భక్తులకు అందుబాటులో పెట్టారు. భక్తులందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం ఇచ్చేలా పెద్దఎత్తున తయారు చేశారు. అలాగే మహిళలకు సౌభాగ్యప్రసాదంగా రవిక, పసుపు, కుంకుమ, గాజులను ఉచిత ప్రసాదం కౌంటర్లలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.గతంలో పది వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా... ఈసారి ఆలయ పరిసరాలతో పాటు పట్టణ వ్యాప్తంగా 25 శిబిరాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. క్యూలైన్లలో భక్తులకు పంపిణీ చేయడానికి రెండు లక్షల వాటర్ బాటిళ్లు, 2 లక్షల బిస్కెట్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఇక రాత్రి నంది సేవలో భక్తుల రద్దీకి అనుగుణంగా మాడవీధుల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం అర్ధరాత్రిపైన ఆలయంలో లింగోద్భవం సందర్భంగా సామాన్య భక్తులందరూ దర్శించుకునేలా క్యూలైన్ విధానాన్ని పాటించనున్నారు.



ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు బుధవారం వేకువజామున 4గంటల నుంచి పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలను ఆపేయనున్నారు. దీనికోసం అన్ని ప్రవేశ మార్గాల వద్ద పోలీస్ అవుట్ పోస్టులతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల కోసం కేటాయించారు. పట్టణ అన్ని ప్రవేశ మార్గాలోని శివారు మార్గాల్లో మొత్తం 11 వాహనాల పార్కింగ్ కేంద్రాలను కేటాయించారు. అక్కడి నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేలా ఉచిత రవాణా సౌకర్యాన్ని సిద్ధం చేశారు.



సిద్ధమైన ఉచిత దర్శన క్యూలైను



అద్దాల మండపం వద్ద క్యూలైన్లు పరిశీలిస్తున్న ఏఎస్పీ రవి మనోహరాచారి



రూ500 క్యూలైన్లు



ఆలయంలో అకట్టుకుంటున్న పూల అలంకరణలు



రూ.200 క్యూలైన్

కల్యాణ వెంకన్న రథోత్సవం

చంద్రగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం రథోత్సవం కన్నులపండువగా జరిగింది. పుష్పాలంకృత రథంపై శ్రీదేవి భూదేవి సమేత ఉత్సవమూర్తులను రథంలో అధిష్ఠింపజేశారు. గోవింద నామస్మరణల మధ్య అర్చకులు, అధికారులు,భక్తులు మాడవీధుల్లో రథాన్ని భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. రాత్రి పట్టు, పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో కల్కి అవతారంగా స్వామిని అలంకరించారు. ఉత్సవవర్లు అశ్వ వాహనంపై అధిష్ఠించి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కాగా కల్యాణ వేంకటేశ్వరస్వామిని సినీనటుడు డాక్టర్ మోహన్‌బాబు దర్శించుకున్నారు. అశ్వ వాహన సేవలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవోల వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, కంకణ భట్టర్ నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.





అశ్వవాహన సేవలో మోహన్‌బాబు

వైసీపీకి భారీ షాక్

● పవన్ సమక్షంలో పెద్దఎత్తున జనసేనలో చేరికలు

తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆపార్టీకి చెందిన పది మంది కార్పొరేటర్లు, ఇద్దరు టౌన్‌బ్యాంకు డైరెక్టర్లు, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లతో పాటు మరో 11 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలో మంగళవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో వీరంతా జనసేన కండువా కప్పుకొన్నారు. తొలుత వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు మాత్రమే జనసేనలోకి చేరుతారని ప్రచారం జరిగింది. అయితే పెద్దఎత్తున వైసీపీ నేతలు చేరడంతో రాజకీయంగా చర్చగా మారింది. డిప్యూటీ మేయర్ ఎన్నికల నేపథ్యంలో మనస్తాపంతో బయటకు వచ్చిన భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అనుచరుడు 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే బాబు పవన్ సమక్షంలో జనసేనలో చేరి షాక్ ఇచ్చారు. అలాగే, వైసీపీ కార్పొరేటర్లు పొన్నాల చంద్ర (28వ డివిజన్), టిశైలజ (32వ), దూది కుమారి (33వ), కుడితి సుబ్రమణ్యం (36వ), రాధ యాదవ్ (43వ), ఆదం లీలావతితో పాటు ఇదివరకు చేరిన సీకే రేవతి (31వ), కల్పన యాదవ్ (30వ), వట్టికుంట నారాయణ (44వ డివిజన్) కూడా పవన్ సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. తిరుపతి టౌన్ బ్యాంకు డైరెక్టర్లు అనిల్ రాయల్, వెంకటేష్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ కొటారి సుభాష్‌తో పాటు అధికార ప్రతినిధి తిరుత్తణి వేణుగోపాల్, నాయకులు దూది శివ, ఎస్కే.ఫిరోజ్, పి.సుధీర్, నయనార్ శ్రీనివాసులు, సునీల్ చక్రవర్తి, యశ్వంత్, కార్తీక్, నరేష్ రెడ్డి, సీకే రవి, యాదవ కృష్ణ జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు ఆరణి మదన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఉన్నారు.







జేఎస్పీలో చేరిన వైసీపీ యువత అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ - వైసీపీ సీనియర్ నేత, కార్పొరేటర్ ఎస్కేబాబు - టౌన్ బ్యాంకు డైరెక్టర్ అనిల్ రాయల్

చైతన్యపురంలో ఏనుగుల మంద బీభత్సం

రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం చైతన్యపురంలో ఏనుగుల మంద బీభత్సం సృష్టించింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వేసవిలో ఏనుగుల మంద నీటి కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లడం సాధారణం. మే, జూన్ నెలల్లో ఇటువంటి సంఘటనలు జరిగేవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు ఫిబ్రవరిలోనే ఏనుగుల మంద వచ్చి మామిడి తోపులు, వరి పంటలను ధ్వంసం చేయడం ఇదే మొదటి సారంటున్నారు. ఏనుగుల రాకను గమనించిన గ్రామస్తులు భారీ ఎత్తున బాణసంచా కాలుస్తూ మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏనుగుల దాడిలో గాయపడిన బాలికకు రుయాలో చికిత్స

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిలా ఓబులవారిపల్లె మండలం గుండాలకోన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి నాలుగు కిలో మీటర్ల దూరంలోని శేషాచల అడవిలో ఏనుగుల గుంపు దాడి చేసినట ఘటనలో గాయపడిన బాలికకు తిరుపతిలోని రుయాస్పత్రిలో చికిత్స అందించారు. రైల్వే కోడూరు మండలం ఉర్లగట్టుపోడు అరుంధతివాడ, కన్నెగుంట గిరిజన కాలనీలకు చెందిన 30 మంది తలకోనకు వచ్చేందుకు కాలినడకన సోమవారం రాత్రి 7 గంటల సమయంలో శేషాచలం అటవీమార్గంలో వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో ముగ్గురు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో మహాలక్ష్మి(16)ని రుయాస్పత్రి తీసుకురాగా, వైద్యులు పరీక్షించారు. ఆమె కాలిభాగం తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో చికిత్స అందించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.



తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఘటనలపై దర్యాప్తు చేయించండి

● హైకోర్టులో మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి పిల్

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన ఘటనలపై సీబీఐ లేదా హైకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీ లేదా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించాలని కోరుతూ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి మంగళవారం హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈనెల 3, 4 తేదీల్లో పోలీసులు, ఎన్నికల అధికారుల పాత్రపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలని కోరారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, ఏపీ ఎన్నికల సంఘం, కేంద్ర ఎన్నికల సంఘం, సీబీఐ, కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు.